కండరాల వ్యవస్థపై సీసీఎంబీలో జాతీయ స్థాయి వర్క్‌షాప్

సెప్టెంబర్ 20లోపు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడి.

సిటీబ్యూరో, ఆగస్ట్ 17(నమస్తే తెలంగాణ): కండరాల వ్యవస్థ–వ్యాధి, చికిత్సలు, అధ్యయనాలపై పలు పరిశోధన సంస్థలతో కలిసి సీసీఎంబీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. నవంబర్‌లో నిర్వహించే ఈ సదస్సులో కండరాల వ్యవస్థ, టిష్యూ డెవలప్‌మెంట్, వ్యాధులు, చికిత్సా విధానాలపై పీహెచ్‌డీ చేసే విద్యార్థులకు అవగాహన కల్పించేలా, పరిశోధనలను మరింత విస్తృతపరిచేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వర్క్‌షాపునకు హాజరయ్యేందుకు సెప్టెంబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సీసీఎంబీ వర్గాలు ప్రకటించాయి.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి దరఖాస్తులు

సిటీబ్యూరో, ఆగస్ట్ 17(నమస్తే తెలంగాణ): అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి అర్హులైన ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అందించే స్కాలర్‌షిప్‌ను వినియోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు శనివారం పేర్కొన్నారు. విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో అభ్యసించే వారికి ఈ పథకం ఉపయోగం ఉంటుందని వివరించారు. అక్టోబర్ 10 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. telanganaepass.cgg.giv.inలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు, జీఆర్ఈ/జీఎంఏటీ, ఇంగ్లిష్ ప్రావీణ్యత పరీక్షల అర్హత కలిగి ఉండాలన్నారు.

25, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు

సిటీబ్యూరో, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ ఆలయంలో ఈ నెల 25, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం ఘనంగా జరగనుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర శనివారం పేర్కొన్నారు. ఈ వేడుకలు నార్సింగిలోని హరేకృష్ణ హెరిటేజ్ టవర్, సంగారెడ్డి కందిలోని హరేకృష్ణ సాంస్కృతిక కేంద్రంలో కూడా నిర్వహిస్తామని వివరించారు. శ్రీనందనోత్సవంలో భాగంగా శ్రీకృష్ణుని హరినామా సంకీర్తనలతో పాటు విశేష నైవేద్యాలు సమర్పించబడతాయని పేర్కొన్నారు. దర్శన సమయం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అని తెలిపారు. కాగా, ఈ జన్మాష్టమి భగవానున్ని భక్తులు నాలుగు విభిన్న రూపాలలో దర్శించుకునేందుకు ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించామని చెప్పారు. శ్రీ రాధా గోవింద, శ్రీ గోదా కృష్ణ, శ్రీ రాధా గోపినాథ్, శ్రీ లడ్డూ గోపాల్ లేదా ముఖన్ కృష్ణ రూపాల్లో దర్శనమిస్తారన్నారు. భక్తులందరికి ప్రత్యేకంగా లడ్డూ గోపాలుని ఝూలన సేవల్లో పాల్గొని తరించే సదవకాశం కల్పిస్తామని చెప్పారు.

కోచ్‌లు పెంచమన్నం.. ఫీజులు కాదు

- ఎల్ అండ్ టీ మెట్రో తీరుపై ప్రయాణికులు, పార్టీలు ఆగ్రహం
- బేగంపేటలోని మెట్రో భవన్ వద్ద సీపీఎం పార్టీ నాయకుల ధర్నా
- మెట్రో ఎమ్డీని కలిసి వినతి పత్రం అందజేసిన సీపీఐ నాయకులు

బేగంపేటలోని మెట్రో రైలు భవన్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మెట్రో రైలు ఎమ్డీ ఎన్వీఎస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాయకులు

సిటీబ్యూరో, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): 'మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడటానికి చోటు ఉండటం లేదు. కదలడానికి... మెదలడానికి అవకాశం ఉండటం లేదు. మెట్రో కోచ్‌లు పెంచండి.. 3 కోచ్‌లు ఉన్న మెట్రో రైలును ఆరు కోచ్‌ల వరకు పెంచండి' ఇదీ గత కొన్ని నెలలుగా మెట్రో ప్రయాణికులు చేస్తున్న ప్రధాన డిమాండ్. ప్రధానంగా లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు నిత్యం మెట్రోలోనే ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణీకుల రద్దీతో మెట్రో రైళ్ల లోనే కాదు. మెట్రో స్టేషన్ ప్రాంగణాలు సైతం కిక్కిరిసిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులను డిమాండ్లను పరిష్కరించాల్సిన ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు అందుకు భిన్నంగా తుగ్లక్ నిర్ణయం తీసుకున్నారని మెట్రో ప్రయాణికులు, పార్టీలు మండిపడుతున్నాయి. మెట్రో పార్కింగ్ లాట్‌లో ఎనిమిది గంటల పాటు ద్వి చక్రవాహనం నిలిపితే రూ.40.00లు, కారుకు రూ.120.00లుగా నిర్ణయించారు. మెట్రో పార్కింగ్ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసిన ఐటీ ఉద్యోగులు రాయదుర్గంలో ఉద్యోగం చేసి తిరిగి మెట్రోలో వస్తే సుమారు తొమ్మిది గంటల సమయం పడుతుంది. దీంతో ఈ లెక్కన ప్రతి రోజు లక్ష లాది మంది ఐటీ ఉద్యోగులు వాహనాల పార్కింగ్ ఫీజుల కోసమే వేలాది రూపాయలను వెచ్చించాల్సి వస్తోందంటూ మెట్రో అధికారులపై తిరగబడ్డారు. రద్దీ పెరగడంతో మెట్రో కోచ్‌లను పెంచాలని అడుగుతుంటే.. అకస్మాత్తుగా పార్కింగ్ చార్జీలను భారీగా పెంచడం ఏమిటంటూ ప్రయాణికులంతా ఒక్కటై మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. మరోవైపు సీపీఎం నాయకులు సైతం ప్రయాణికులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆగస్టు 25 నుంచి అమలు చేస్తామని చెబుతున్న పార్కింగ్ ఫీజుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామంటూ ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన వందలాది ఎకరాల భూములను తమ ఆదాయం కోసం మాస్తున్నారే తప్ప, ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదంటూ మండిపడుతున్నారు.

ప్రయాణికుల అవసరాలను గుర్తించండి

> నగరంలో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రో రైలులో ప్రయాణికుల అవసరాలను అధికారులు గుర్తించడం లేదంటూ సీపీఎం నాయకులు శనివారం బేగంపేటలోని మెట్రో రైలు భవన్ ముందు ధర్నా చేపట్టారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మెట్రో భవన్ ముందు ఆందోళన చేపట్టారు. రద్దీ పెరగడంతో మెట్రో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెట్రో కోచ్‌లను మూడు నుంచి ఆరుకు పెంచాలని నినాదాలు చేశారు. ధర్నా అనంతరం, హైదరాబాద్ మెట్రో రైలు ఎమ్డీ ఎన్వీఎస్ రెడ్డికి మెట్రో ప్రయాణికుల డిమాండ్లు, ఎదుర వుతున్న ఇబ్బందులపై సీపీఎం నాయకుడు వినతి పత్రాన్ని అందజేశారు.
>
> – బేగంపేటలోని మెట్రో భవన్ వద్ద సీపీఎం నాయకుల ధర్నా

ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు

> నగరంలో మెట్రో రైలు సేవలను అందిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థకు ఆదాయం, లాభాలు తప్ప ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని స్టేషన్లలో ఇప్పటి వరకు ఉచితంగా ఉన్న పార్కింగ్ స్థలాలకు భారీగా చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. పార్కింగ్ చార్జీలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రధానంగా రైలు లోపల నిలబడలేని పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మూడు కోచ్‌లను ఆరు కోచ్‌లుగా పెంచుతామని మెట్రో అధికారులు గతంలో ప్రకటించినప్పటికీ, నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కోచ్‌ల సంఖ్య సంఖ్య పెంచాలని మెట్రో ప్రయాణికులంతా ముక్త కంఠంతో డిమాండు చేస్తున్నప్పటికీ ఎల్ అండ్ టీ యాజమాన్యం సరిగా స్పందించడం లేదు.
>
> – ఎం.శ్రీనివాస్, సీపీఎం నగర కార్యదర్శి

నెలలోగా స్కేలు అమలు చేయాలి

- అన్ని వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్
- లేని పక్షంలో వర్సిటీలు స్తంభించేలా ఉద్యమిస్తామని హెచ్చరిక

సమావేశం అనంతరం అభివాదం చేస్తున్న వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 17: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన స్కేలు అమలు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వానికి నెలరోజుల గడువు విధించారు. లేనిపక్షంలో వర్సిటీలు స్తంభించేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్కేలును అమలు చేసి, సెక్యూరిటీతో కూడిన జీవితాలను 1450 మంది అధ్యాపకులకు వెంటనే అందించాలని కోరారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా బడ్జెట్ కోర్సులను బోధిస్తున్న వారితో సమానంగా స్కేలు వర్తింపజేయాలన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల అడ్మినిస్ట్రేషన్ విధుల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులే ఉండి, విశ్వవిద్యాలయాలను తమ భుజ స్కంధాలపై 20 ఏండ్లుగా మోస్తున్నారని గుర్తు చేశారు. చాలీచాలని వేతనాలు, అర్థాకలితో కుటుంబాలను సైతం పోషించలేని స్థితికి దిగజారుతూ ఉన్నత విద్యను బోధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది విద్యార్థులకు విద్యనందించి, ఉన్నత స్థానాలకు తీర్చిదిద్దాల్సిన కాంట్రాక్ట్ అధ్యాపకులకు తక్షణమే సెక్యూరిటీతో కూడిన స్కేలు ఇవ్వాలన్నారు. నెలలోపు స్కేలు అమలు చేయని పక్షంలో అన్ని వర్సిటీల రిజిస్ట్రార్ కార్యాలయాలు, ప్రజాభవన్‌ల ముందు ధర్నా, ఇందిరా పార్క్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్సిటీల అధికారులు, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు నిరవధిక సమ్మె నోటీసులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీలకు చెందిన డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ ఈ ఉపేందర్, డాక్టర్ దత్తాత్రేయ, డాక్టర్ శ్రీధర్ లోథ్, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్, డాక్టర్ సురేశ్ నాయక్, డాక్టర్ రామేశ్వర్, తాళ్లపల్లి వెంకటేశం, డాక్టర్ నారాయణ గుప్త, డాక్టర్ అర్జున్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ దత్త హరి పాల్గొన్నారు.

ఇండిపెండెన్స్ డే వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో ఇబ్రహీంపట్నం జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఇబ్రహీంపట్నం 25–18, 22–25, 15–12తో ఆదయ్యనగర్ ప్లేగ్రౌండ్ టీమ్‌పై విజయం సాధించింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి, ప్లేయర్లకు ట్రోఫీలు అందజేశారు.

– హైదరాబాద్, ఆట ప్రతినిధి

గ్రేటర్ యాదవ సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్ యాదవ్

బోయిని వెంకటేష్ యాదవ్‌కు సన్మానం చేసిన చైర్మన్ చిట్టబోయిన నంద కిషోర్, వి.కిషన్, వి.పాండు, శైలేందర్ యాదవ్‌లు

అబిడ్స్, ఆగస్టు 17: గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా బోయిని వెంకటేష్ యాదవ్ నియమితులయ్యారు. జాంబాగ్‌లోని యాదవ సంఘం భవనంలో యాదవ సంఘం గ్రేటర్ చైర్మన్, ట్రస్టు సభ్యులు చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ చేతుల మీదుగా బోయిని వెంకటేష్ యాదవ్‌కు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోయిని వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, గ్రేటర్‌లో ఉన్న యాదవులందరిని ఏకతాటిపైకి తీసుకు వచ్చి సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానన్నారు. అదే విధంగా శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని త్వరలో గ్రేటర్ యాదవ సంఘం జాంబాగ్ పూర్తి కమిటీని ప్రకటిస్తామని అయన తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన నంద కిషోర్ యాదవ్, రాష్ట్ర ట్రస్ట్ బోర్డు సభ్యులు కిషన్ యాదవ్, గోపాల్ యాదవ్, అందెల శైలేందర్ యాదవ్, మేకల రాజేందర్, మనీష్ యాదవ్, రామారావు యాదవ్, కిషన్ యాదవ్, కుల పెద్దలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరపాలి

అందరు సమన్వయంతో పనిచేయాలి

శాఖల సమన్వయ సమావేశంలో మంత్రి పొన్నం ఆదేశాలు

సిటీబ్యూరో, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): వచ్చే నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అందరు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గణేష్ పండుగ – 2024పై ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. వచ్చే వారం రోజుల్లో ప్రజా ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మీటింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు సమావేశం నిర్వహించామన్నారు. విగ్రహాల తయారీ ప్రాంతం నుంచి ఇతర జిల్లాలకు పోయే విగ్రహాల వరకు రూట్‌లలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

శోభాయాత్ర జరిగే ప్రాంతాలు, రహదారులపై గుంతలు లేకుండా, విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం ఉండాలని, బాంబే తర్వాత హైదరాబాద్‌లోనే గణేష్ ఉత్సవాలు ఘనంగా చూస్తామని చెప్పారు. నిమజ్జనం అంశం కోర్టు ఆదేశాల ప్రకారమే ముందుకు పోతామని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడే ఎన్జీవో సంస్థల ద్వారా లక్షల్లో మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

కార్వాన్ కుల్సుంపురా ప్రాథమిక, ఉన్నత పాఠశాలను రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి సదుపాయాలు, పుస్తకాలు అందాయా? బోధన ఎలా ఉంది? అనే విషయాలను తెలుసుకున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి తరగతి గదిలో నేలపై కూర్చొని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. విద్యారంగం బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.1100 కోట్లతో రాష్ట్రంలోని 25 వేల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

ఆ ప్రచారాలు.. దిగజారిన ప్రకటనలకు నిదర్శనం

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం తప్పుడు వ్యాఖ్యలు

సామాజిక కార్యకర్త నారగోని ప్రవీణ్ కుమార్

సిటీబ్యూరో, ఆగస్ట్ 17(నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని సామాజిక కార్యకర్త, తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా 39 మంది ఎమ్మెల్యేలను గెలిచిన పార్టీ బీజేపీలో ఎందుకు విలీనం అవుతుందన్నారు. ఇంతకన్నా అసత్యపు ప్రచారం మరోటి లేదని స్పష్టం చేశారు. కేవలం 2 శాతం ఓట్లతో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందని, కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన కొందరు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో పోల్చితే బీఆర్ఎస్‌లోనే సమర్థవంతమైన నాయకులు, నాయకత్వం ఉందన్నారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట కవితను జైలు నుంచి విడిపించేందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయనుందని వ్యాఖ్యానించారు. అపర చాణక్యుడిగా పేరున్న కేసీఆర్ స్వప్రయోజనాల కోసం పార్టీని బలి చేయరని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌పై ప్రజల్లో ఇంకా నమ్మకం ఉందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్ వైపే జనాలు మొగ్గుచూపుతారని జోస్యం చెప్పారు. యువ నాయకత్వం నిండిన హరీశ్ రావు, కేటీఆర్, జగదీశ్ రెడ్డి వంటి నేతలతో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు.

నెక్ సదస్సులో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రతి రోజు గుడ్డు తింటే.. సంపూర్ణ ఆరోగ్యం

నెక్ సదస్సులో వక్తల వెల్లడి

వనస్థలిపురం, ఆగస్టు 17: మన ఆహారంలో ప్రతి రోజు రెండు నుంచి ఆరు గుడ్లు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పలువురు వక్తలు పేర్కొన్నారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (నెక్) ఆధ్వర్యంలో 'గుడ్డు ఆరోగ్యమైన ఆహారం' అనే అంశంపై వనస్థలిపురంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రసంగించారు. ప్రతి మనిషి తాము ఎన్ని కిలోల బరువుంటే అన్ని గ్రాముల ప్రొటీన్‌ను ప్రతి రోజు తీసుకోవాలని సూచించారు. ప్రతి గుడ్డులో ఆరు గ్రాముల ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయన్నారు. 25 వేల ఏండ్ల క్రితం నుంచే గుడ్డు పౌష్టికాహారంగా ఉంటుందన్నారు. కొవిడ్ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుడ్డు తినడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పిండి పదార్థాలను తగ్గించి గుడ్డును ఎక్కువగా తినేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం, పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ మల్లింద్ర స్వామి, డాక్టర్ భరత్, ప్రముఖ న్యూట్రిషన్ నిపుణులు డాక్టర్ జానకి, డాక్టర్ శ్రీనాథ్, కీటో డైట్ నిపుణులు దుర్గా ప్రసాద్, వెంకటేశ్వర హేచరీస్ జీఎం కేజీ ఆనంద్, నెక్ అడ్వైజర్ డాక్టర్ బాలస్వామి, నెక్ సీవోవో డాక్టర్ ఏజిల్ ఈ కుమార్ పాల్గొన్నారు.

అపోలో జే ఎమ్డీ, డాక్టర్ సంగీతారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డీజీహెచ్ఎస్ ప్రొఫెసర్, డాక్టర్ అతుల్ గోయెల్

అంటు వ్యాధులు, పరిశుభ్రతపై దృష్టి సారించండి

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డీజీహెచ్ఎస్ ప్రొఫెసర్, డాక్టర్ అతుల్ గోయెల్

మాదాపూర్, ఆగస్టు 17: అంటు వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ప్రొఫెసర్, డాక్టర్ అతుల్ గోయెల్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం ఏర్పాటు చేసిన సిడ్‌స్కాన్ 2014 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్, డాక్టర్ అతుల్ గోయెల్ విచ్చేసి, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ సంగీతారెడ్డి, క్లినికల్ ఇన్వెస్టిగేషన్స్ డిసీజెస్ సొసైటీ (సీఐడీఎస్) అధ్యక్షుడు, డాక్టర్ జార్జ్ ఎం వర్గీస్, సిడ్‌స్కాన్ ఆర్గనైజింగ్ చైర్, డాక్టర్ సునీతా నరైడ్డితో కలిసి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగాలు అంతకంతకు ప్రబలుతున్న కారణంతో అంటు వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలన్నారు. యాంటీ బయోటిక్ దుర్వినియోగం, మితిమీరిన వినియోగం వల్ల ఏఎంఆర్ పెరుగుతుందన్నారు. సిడ్‌స్కాన్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, డాక్టర్ సునీత నరైడి మాట్లాడుతూ, దేశంలో ప్రజా రోగ్యానికి ముప్పు తెచ్చే రెండు క్లిష్టమైన సవాళ్ళు ఉన్నాయని, అవి యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్), ఎమర్జింగ్ ఇన్ఫెక్షన్లుగా పేర్కొన్నారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ నిశ్శబ్ద మహమ్మారిగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐడీఎస్ సెక్రటరీ, డాక్టర్ వసంత్ నాగ్వేకర్, సీఐడీఎస్ కోశాధికారి, డాక్టర్ అశ్విని, సిడ్‌స్కాన్ 2024 ఆర్గనైజింగ్ సెక్రెటరీ, డాక్టర్ వెంకట్ రమేష్, సిడ్ స్కాన్ సైంటిఫిక్ కమిటీ చైర్మన్, డాక్టర్ ఓసీ అబ్రహం పాల్గొన్నారు.

రియాల్టీ సమస్యలకు పరిష్కారం చూపాలి

- రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి సీఎం రేవంత్ చొరవ తీసుకోవాలి
- ఆగస్ట్ 20న క్రెడాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్టేట్‌కాన్-2024 సదస్సు

బ్రోచర్ ఆవిష్కరించి, స్టేట్‌కాన్–2024ను వెల్లడించిన క్రెడాయ్ తెలంగాణ ప్రతినిధుల బృందం

సిటీబ్యూరో, ఆగస్ట్ 17(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రియాల్టీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని క్రెడాయ్ తెలంగాణ ప్రతినిధుల బృందం కోరింది. హైదరాబాద్‌లో క్రెడాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆగస్ట్ 20న జరగనున్న స్టేట్‌కాన్–2024 రియాల్టీ రాష్ట్ర సదస్సు షెడ్యూల్‌ను శనివారం ప్రకటించారు. క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీ కృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ ప్రేంసాగర్ రెడ్డి మాట్లాడుతూ, భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వేగంగా జరగడం లేదని, పర్యవేక్షణ, పరిశీలన అధికారాలను జిల్లా కలెక్టర్లకు అప్పగించడం వలన అనుమతుల్లో జాప్యం జరుగుతుందన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగానికి తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అదే విధంగా భూముల ధరల పెంపును స్వాగతిస్తున్నామని, అదే విధంగా ప్రభుత్వం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలని సూచించారు. దీంతో నిర్మాణ రంగంపై ఎలాంటి భారం పడదన్నారు. మహిళల పేరిట ప్రోత్సాహకాలను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఆగస్ట్ 20న జరిగే రాష్ట్ర స్థాయి స్టేట్‌కాన్ క్రెడాయ్ తెలంగాణ సదస్సులో సీఎం రేవంత్‌పై భారీ ఆశలు ఉన్నాయని పేర్కొన్